

ప్రజా

# రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 95 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 3 ✦https:www.prajarepublic.com ✦ వెల - 1/-

శనివారం 09 నవంబర్ 2024

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepalleguden, Kadapa, Ongole



GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM


## భవిష్యత్లో ఏ ఇజం ఉండదు..
## టూరిజం ఒక్కటే ఉంటుంది : చంద్రబాబు

భవిష్యత్ అంతా పర్యాటకానిదే అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. భవిష్యత్లో ఏ యిజం ఉండదు... టూరిజం ఒక్కటే ఉంటుందని పేర్కొన్నారు.



**విజయవాడ ,నవంబర్, 09 (రిపబ్లిక్ న్యూస్):** భవిష్యత్ అంతా పర్యాటకానిదే అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. భవిష్యత్ లో ఏ ఇజం ఉండదు.. టూరిజం ఒక్కటే ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో తొలిసారి పర్యాటకంగా 'సీ ప్లేన్' వినియోగం ఏపీ నుంచి ఆరంభం కానుంది. సీప్లేన్ పర్యాటకాన్ని చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించారు. విజయవాడలోని పున్నమిఘాట్ నుంచి శ్రీశైలం వరకు సీఎం చంద్రబాబు, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, పలువురు కేంద్ర, రాష్ట్రప్రభుత్వ అధికారులు ఇందులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. తక్కువ సమయంలోనే పెరుగుతోంది. దానిని పూర్తిగా వినియోగించుకోవాలి. ఐటీ అంటే ఆనాడు ఎగతాళి చేశారు. ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడ చూసినా మనవాళ్లే ఉన్నారు. అనునిత్యం కొత్త ఆలోచనలు చేయాలి. రాబోయే రోజుల్లో విమానాశ్రయాలే కాకుండా సీప్లేన్ ద్వారా రవాణా సౌకర్యం లభిస్తుంది" "రాష్ట్రంలో విధ్వంసమైన వ్యవస్థను బాగుచేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. ఎంత త్వరగా అనుకున్న ప్రగతిని సాధించాలనేదే ఆలోచిస్తున్నాం. గాడితప్పిన పరిపాలనను సరిచేయడమే నా లక్ష్యం. ఏపీలోని రోడ్లను చూసి అవహేళన చేశారు. పోగొట్టిన బ్రాండ్ను తిరిగి తీసుకొచ్చే బాధ్యత తీసుకున్నాం. ప్రజలు గెలవాలి.. ఎన్డీయేకు ఓటేయాలని నేను, పవన్, నరేంద్ర మోదీ కోరాం. ఏపీ ప్రజలు గెలిచారు.. మన రాష్ట్రాన్ని నిలబెట్టారు. వెంటిలేటర్పై ఉన్న రాష్ట్రానికి ప్రజలు ఆక్సిజన్ ఇచ్చారు." అని చంద్రబాబు పేర్కొన్నారు. అత్యున్నత స్థానానికి ఎదిగిన వ్యక్తి రామ్మోహన్ నాయుడు అని కేంద్ర మంత్రివర్గంలో అత్యంత యువకుడాయన అని కొనియాడారు. "సీప్లేన్ ప్రయాణం.. వినూత్న అవకాశమిది. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలి. సంపద సృష్టిస్తేనే ఆదాయం పెరుగుతుంది. సాంకేతికత చాలా వేగంగా

## ప్రేమ వివాహం.. సెల్టవర్ ఎక్కి యువకుడి హల్చల్

పల్నాడు జిల్లా క్రోసూరు మండల కేంద్రంలో సెల్ టవర్ ఎక్కి ఓ యువకుడు హల్ చల్ చేశాడు.



**క్రోసూర, నవంబర్, 09 (రిపబ్లిక్ న్యూస్):** పల్నాడు జిల్లా క్రోసూరు మండల కేంద్రంలో సెల్ టవర్ ఎక్కి ఓ యువకుడు హల్ చల్ చేశాడు. పోలీసులు అతడికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. క్రోసూరు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ వలి (22), సిరిపురం గ్రామానికి చెందిన యువతితో పెద్దలకు తెలియకుండా ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. అదే గ్రామంలో యువతితో కలిసి సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో యువతి తల్లిదండ్రులు అతడిని బెదిరించడంతోపాటు ఆమెను తీసుకెళ్లిపోయారు. దీంతో మనసాపానికి గురైన యువకుడు సెల్టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటన స్థలికి చేరుకొని అతడిని సముదాయించారు. డీఎస్పీ హామీ ఇస్తేగాని కిందకి దిగనని యువకుడు చెబుతున్నాడు.

## శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న సీఎం చంద్రబాబు

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తదితరులు దర్శించుకున్నారు.



**కర్నూలు, నవంబర్, 09 (రిపబ్లిక్ న్యూస్):** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని ) ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తదితరులు దర్శించుకున్నారు. అంతకుముందు పౌర విమానయాన శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీశైలంలోని పాతాళ గంగలో సీ ప్లేన్ డెమో లాంచ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ, ఎఫ్ఎఐసీసీఐ భాగస్వాములుగా ఉన్నారు. శనివారం విజయవాడ పున్నమి ఘాట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు " సీ ప్లేన్" ప్రారంభించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి అందులో ప్రయాణించి శ్రీశైలం చేరుకున్నారు. శ్రీశైలం పాతాళగంగలో సురక్షితంగా " సీ ప్లేన్" ల్యాండ్ అయ్యింది. ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తమ హర్షధ్వానాల మధ్య ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం పలికారు.రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, కందుల దుర్గేష్, ఆనం రామనారాయణ రెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, చరితా రెడ్డి తదితరులు ముఖ్యమంత్రికి ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం పాతాళగంగ నుంచి చంద్రబాబు రోప్ వే లో శ్రీశైలం ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీశైల మల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద ఆశీర్వచనం ఇచ్చి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## నాగార్జున సాగర్ వద్ద ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య వివాదం

ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య నాగార్జున సాగర్ వద్ద మరోసారి వివాదం చోటుచేసుకుంది.



**నాగార్జున సాగర్, నవంబర్, 09 (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య నాగార్జున సాగర్ వద్ద మరోసారి వివాదం చోటుచేసుకుంది. కుడి కాల్వ వాటర్ రీడింగ్ నమోదుకు తెలంగాణ అధికారులు వచ్చారు. వీరిని ఏపీ అధికారులు అడ్డుకోవడంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనపై కేఆర్ఎంబీ యాజమాన్యానికి తెలంగాణ అధికారులు సమాచారమిచ్చారు. ఇరు రాష్ట్రాల అధికారులకు సాగర్ ఎస్ఈ కృష్ణమోహన్ సర్దిచెప్పారు.

## డ్రగ్స్.. గత ప్రభుత్వ అవినీతి నుంచి
## సంక్రమించిన వారసత్వ సమస్య: పవన్ కల్యాణ్

ఏపీలో మాదకద్రవ్యాలు పెనుముప్పుగా మారాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు.



**అమరావతి, నవంబర్, 09 (రిపబ్లిక్ న్యూస్):** ఏపీలో మాదకద్రవ్యాలు పెనుముప్పుగా మారాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. గత ప్రభుత్వ అవినీతి నుంచి ఎన్డీయే కూటమికి సంక్రమించిన వారసత్వ సమస్య ఇది అని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. డ్రగ్స్ మాఫియా, గంజాయి సాగును అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొంత కాలం క్రితం విశాఖ ఓడరేవులో కొకైన్ స్వాధీనం చేసుకున్నారని గుర్తుచేశారు. దేశంలోని ఇతరచోట్ల పట్టుబడిన డ్రగ్స్కు రాష్ట్రంతో సంబంధాలున్నాయని చెప్పారు. విజయవాడలోని ఒక వ్యాపార సంస్థతో సంబంధాలు బయటకొచ్చాయని తెలిపారు. నేరస్థుల కట్టడికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అవసరమని పవన్ కల్యాణ్ అన్నారు.

## ప్రధాని అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే..
## మేం నిజాలు చెబుతూనే ఉంటాం: సీఎం రేవంత్

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర



**ముంబయి, నవంబర్, 09 (రిపబ్లిక్ న్యూస్):** మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ.. తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని సీఎం రేవంత్రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధాని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం కోసం రేవంత్రెడ్డి ముంబయి వెళ్లారు. అక్కడి పీసీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చిందని మోదీ అన్నారు. తెలంగాణలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల రుణాలు మాఫీ చేశాం. 22 లక్షల మంది రైతులకు రూ.17,829 కోట్లు రుణమాఫీ చేశాం. ఇందుకు సంబంధించి వివరాలు కావాలంటే ఇవ్వడానికి మేం సిద్ధం. తెలంగాణలో 10 నెలల్లోనే 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. మహారాష్ట్ర భాజపా నేతలు తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ప్రధాని కాంగ్రెస్ గ్యారంటీల అమలుపై అబద్ధాలు చెబుతున్నారు. ఆయన అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే మేం నిజాలు చెబుతూనే ఉంటాం. మహారాష్ట్ర ప్రజలకు 6 గ్యారంటీల అమలుపై నిజాలు చెప్పేందుకు వచ్చా. ఇక్కడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని మరిచాయి. నల్ల చట్టాలు తెచ్చి అదానీ, అంబానీలకు మేలు చేయాలని మోదీ భావించారు. సామాజిక న్యాయం అందించేందుకు తెలంగాణలో కులగణన చేపట్టాం. దేశ చరిత్రలో మహారాష్ట్రకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడికి రావాల్సిన 17 మెగా ప్రాజెక్టులు గుజరాత్కు వెళ్లాయి. ఇక్కడి ప్రజలను మోసం చేసిన భాజపాను ఎన్నికల్లో ఓడించాలి" అని రేవంత్రెడ్డి అన్నారు. చెప్పారు.

## అవినీతి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం: కేటీఆర్

సీఎం రేవంత్రెడ్డి నియోజకవర్గంలోని పనుల టెండర్ల ద్వారా ప్రభుత్వ అవినీతి బయటపడిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.



**హైదరాబాద్, నవంబర్, 09 (రిపబ్లిక్ న్యూస్):** సీఎం రేవంత్రెడ్డి నియోజకవర్గంలోని పనుల టెండర్ల ద్వారా ప్రభుత్వ అవినీతి బయటపడిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఎక్కువ కోట్ చేసిన అనుకూల కంపెనీలకు టెండర్లు కట్టబెట్టారని ఆరోపించారు. రాష్ట్రం ఇబ్బందుల్లో ఉంటే రూ.4,350 కోట్ల ప్రజాధనాన్ని కొందరికి అప్పగించారని చెప్పారు. అవినీతి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఖజానా నింపుకొనేందుకు తెలంగాణను ఏటీఎంగా వాడుకుంటోందని కేటీఆర్ అన్నారు.

## సామాన్యులకు అందుబాటు ధరల్లో సీ ప్లేన్ ప్రయాణం: కేంద్ర మంత్రి రామ్మోహన్

సీ ప్లేన్ ను అందరికీ అందుబాటులోకి తెస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.



**విజయవాడ, నవంబర్, 09 (రిపబ్లిక్ న్యూస్):** సీ ప్లేన్ ను అందరికీ అందుబాటులోకి తెస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. మరో 3-4 నెల్లలో ఏపీలో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. సామాన్యులకు అందుబాటు ధరల్లో సీ ప్లేన్ ప్రయాణం ఉంటుందని చెప్పారు. ఏపీలో 4 రూట్లలో నడిపేందుకు ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.ప్రకాశం బ్యారేజీ వద్ద పున్నమిఘాట్కు సీ ప్లేన్ చేరుకుంది. కాసేపట్లో బ్యారేజీ నుంచి శ్రీశైలం వరకు సీఎం చంద్రబాబు ఇందులో ప్రయాణం చేయనున్నారు. దీంతో పున్నమి ఘాట్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 14 మంది కూర్చునేలా సీ ప్లేన్ సీటింగ్ ఏర్పాటు చేశారు. ఇందులో ప్రయాణించి సీఎం శ్రీశైలానికి చేరుకోనున్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, పలువురు అధికారులు పాల్గొంటున్నారు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# వర్రా రవీందర్ రెడ్డి కేసు..

## ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పీఏ ఇంటికి పోలీసులు

ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పీఏ రాఘవరెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు పులివెందులలోని ఆయన ఇంటికి వెళ్లారు.



**పులివెందుల, నవంబర్, 09 (రిపబ్లిక్ న్యూస్):** ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి పీఏ రాఘవరెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు పులివెందులలోని ఆయన ఇంటికి వెళ్లారు. వర్రా రవీందర్రెడ్డి కేసు విచారణ నిమిత్తం వారు అక్కడికి వెళ్లారు. వర్రా రవీందర్రెడ్డితో అవినాష్ పీఏ రాఘవరెడ్డి మాట్లాడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంట్లో ఆయన లేరని కుటుంబ సభ్యులు చెప్పడంతో వెనుదిరిగారు. మరోవైపు ఈ విషయమై పులివెందుల అర్బన్ సీఐ జీవన్ రంగనాథ్ లాయర్ ఓబులరెడ్డి మాట్లాడారు.వైకాపా అధికారంలో ఉండగా వర్రా రవీంద్రారెడ్డి అడ్డూ అదుపూ లేకుండా మితిమీరి ప్రవర్తించారు. చంద్రబాబు, పవన్కల్యాణ్, లోకేశ్, వంగలపూడి అనితపై అసభ్యకరమైన పోస్టులు పెట్టారు. ఆయనపై మంగళగిరి, హైదరాబాద్లో పలు కేసులున్నాయి. ఆయన్ను పట్టుకునేందుకు పోలీసులు యత్నిస్తున్నారు.

# చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు.. బోరుగడ్డ అనిల్‌పై మరో కేసు

రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను పోలీసులు పీటీవారెంట్పై కర్నూలుకు తీసుకువచ్చారు. సోషల్ మీడియాలో సీఎం. చంద్రబాబు, మంత్రి లోకేశ్ పై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు.



**కర్నూలు, నవంబర్, 09 (రిపబ్లిక్ న్యూస్):** రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను పోలీసులు పీటీవారెంట్పై కర్నూలుకు తీసుకువచ్చారు. సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్పై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయనపై గతంలో తెదేపా నేత గట్టు తిలక్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కర్నూలు మూడో పట్టణ పోలీసు స్టేషన్లో మరో కేసు నమోదైంది. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో బోరుగడ్డ అనిల్ అరాచకానికి హద్దే లేకుండా పోయింది. పోలీసులు సైతం అతని వైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి కల్పించాడు. 2021లో కర్లపూడి బాబుప్రకాష్ను రూ.50 లక్షలు ఇవ్వాలంటూ బెదిరించిన కేసులో ఇటీవల పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నల్లపాడు రాణాకు తరలించారు. బోరుగడ్డ అనిల్.. జగన్కు తొత్తుగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలు, ప్రతిపక్షనేతలపై సభ్యసమాజం తలదించుకునేలా సామాజిక మాధ్యమాలు, టీవీ డిబేట్లలో ఇష్టానుసారం దూషణలు చేశాడు. వైకాపా ఐదేళ్ల పాలనలో జగన్కు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడినా వారిపై అసభ్యకర పదజాలంతో విరుచుకుపడేవాడు. జగన్ను వ్యతిరేకిస్తూ మాట్లాడితే చంపేస్తానంటూ బెదిరింపులకు దిగేవాడు. చంద్రబాబునాయుడు, పవన్కళ్యాణ్, లోకేశ్ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ప్రతిపక్షాలకు చెందిన మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడి దూషించేవాడు.

# మహానందిలో అఘోరి

మహానందీశ్వరుణ్ణి దర్శించి సేవించుకున్న శివవిష్ణుబ్రహ్మ త్రిమూర్తి అఘోరీ



**మహానంది, నవంబర్ 9 రిపబ్లిక్ న్యూస్:** గత కొద్ది రజులుగా రెండు తెలుగు రాష్ట్రాలలో శైవ క్షేత్రాలలో మహిళా అఘోరి హల్చల్ చేస్తుంది శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో మహిళా అఘోరి ప్రత్యక్షమైంది పలు పుణ్యక్షేత్రాలలో మహిళా అఘోరి దిగంబరంగా దర్శనానికి రావడంతో అక్కడి ఆలయ అధికారులు అభ్యంతరం తెలిపారు పోలీసులు అఘోరి కారును కూడా స్వాధీనం పరుచుకున్నట్లు తెలుస్తోంది మహానందిలో మాత్రం దుస్తులతో రావడంతో ఆలయ అధికారులు వేద పండితులు చండూరి రవిశంకర్ అవధాని అఘోరి వెంట ఉండి దర్శనం చేయించారు భక్తులు అఘోరి ఆశీర్వాదాలు తీసుకుంటూ సెల్ఫీలు తీసుకున్నారు

# సమగ్ర కులగణనను దేశమంతా గమనిస్తోంది : భట్టి విక్రమార్క

రాష్ట్రంలో చేపడుతున్న సమగ్ర సర్వేపై ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.



**హైదరాబాద్, నవంబర్, 09 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలో చేపడుతున్న సమగ్ర సర్వేపై ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్యూమరేటర్లతో కలెక్టర్లు మాట్లాడి ప్రజల్లో తలెత్తే సందేహాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రజల్లో నెలకొన్న అనుమానాలను వెంటనే నివృత్తి చేయాలని పేర్కొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొనేలా రోజు సమాచారం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో సమగ్ర కులగణనను దేశమంతా గమనిస్తోందని ఈ సందర్భంగా భట్టి పేర్కొన్నారు.

# పట్టాలు తప్పిన సికింద్రాబాద్–శాలీమార్ ఎక్స్ప్రెస్

సికింద్రాబాద్– శాలీమార్ ఎక్స్ ప్రెస్ రైలు పట్టాలు తప్పింది.



**హైదరాబాద్, నవంబర్, 09 (రిపబ్లిక్ న్యూస్):** సికింద్రాబాద్–శాలీమార్ ఎక్స్ప్రెస్ రైలుకు ప్రమాదం తప్పింది. ఈ వీక్లీ స్పెషల్ రైలుకు ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని సౌత్–ఈస్ట్రన్ రైల్వే సీపీఆర్వో వెల్లడించారు.పశ్చిమబెంగాల్ రాజధాని కోల్కతాకు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్పూర్ స్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు మధ్య ట్రాక్ నుంచి వెలుపలి ట్రాక్కు మారుతుండగా ప్రమాదవశాత్తూ మూడు బోగీలు పట్టాలు తప్పాయి. వీటిలో రెండు ప్రయాణికుల బోగీలు కాగా.. ఒక పార్సిల్ వ్యాన్ అని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రయాణికులను బస్సుల్లో కోల్కతాకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

# జాతీయ విద్యా దినోత్సవ వ్యాసరచన పోటీలు

## నిర్వహణ నందాల ఐఎంఏ, లయన్స్ క్లబ్, 11వ తేదీ బహుమతి ప్రధానం




జాతీయ విద్యా దినోత్సవ వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

**నంద్యాల నవంబర్ 9 ( రిపబ్లిక్ న్యూస్):** స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి,భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవం సందర్భంగా నవంబర్ 11 జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకుని, ఐఎంఏ నంద్యాల,లయన్స్ క్లబ్ నంద్యాల సంయుక్త నిర్వహణలో శనివారం రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల భాషలలో వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. "మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం–సందేశం" అన్న అంశంపై 90 నిమిషాలు కేటాయించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొన్న 200 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రవికృష్ణ, ఐఎంఏ నంద్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు,లయన్స్ క్లబ్ నంద్యాల అధ్యక్షులు నిజాముద్దీన్, కోశాధికారి మామిళ్ల నాగరాజు, రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, కళారాదన యువజన విభాగం అధ్యక్షులు పత్తి రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ ,డాక్టర్ మధుసూదన రావు,నిజాముద్దీన్ మాట్లాడుతూ తెలుగు, ఆంగ్ల భాషలలో వేరువేరుగా ప్రథమ, ద్వితీయ,తృతీయ , రెండు స్పెషల్ జ్యూరీ బహుమతులకు విజేతలను ఎంపిక చేసి 11వ తేదీ రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహించే జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమంలో బహుమతులుగా దేశ నాయకుల పుస్తకాలు, జ్ఞాపికలు,బహుమతి ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ మధుసూదన్ రావు నిజాముద్దీన్ స్పాన్సర్ చేసి సహకారం అందించారు.

# రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ గా మౌలానా ముస్తాక్ అహ్మద్




**నంద్యాల, నవంబర్ 9 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ గా మైనార్టీ నాయకులు మూలాన ముస్తాక్ అహ్మద్ను నియమించారు. మౌలానా ముస్తాక్ అహ్మద్ టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షునిగా కొనసాగుతునాడు. నంద్యాలలో ముస్లిం మైనార్టీ నాయకునిగా సేవలు అందిస్తూ తెలుగుదేశం పార్టీకి గత ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేశాడు.

# రాఘవేంద్రస్వామిని దర్శించుకున్న 'పుష్ప' చిత్రం విలన్

కర్నూలు జిల్లా మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామి బృందావనం దర్శనార్థం బహుభాషా నటుడు, పుష్ప చిత్రం విలన్ డాలీ ధనుంజయ శనివారం మంత్రాలయానికి చేరుకున్నారు.



**మంత్రాలయం, నవంబర్, 09 (రిపబ్లిక్ న్యూస్):** కర్నూలు జిల్లా మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామి బృందావనం దర్శనార్థం బహుభాషా నటుడు, పుష్ప చిత్రం విలన్ డాలీ ధనుంజయ శనివారం మంత్రాలయానికి చేరుకున్నారు. శ్రీ మఠం చేరుకున్న ఆయనకు శ్రీమఠం అధికారులు స్వాగతం పలికారు. ఆయన తొలుత గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకున్నారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట రాఘవేంద్ర స్వామి మఠం పీఆర్వో వ్యాసరాజాచార్, కర్ణాటక కానిస్టేబుల్ శంకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# మదనపల్లె మాజీ ఆర్డీవో సోదరుడి ఇంట్లో ఏసీబీ తనిఖీలు

మదనపల్లె మాజీ ఆర్డీవో మురళి సోదరుడి ఇంట్లో ఏసీబీ తనిఖీలు చేపట్టింది..




**మదనపల్లె, నవంబర్, 09 (రిపబ్లిక్ న్యూస్):** మదనపల్లె మాజీ ఆర్డీవో మురళి సోదరుడి ఇంట్లో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. మురళిపై ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు ఆరోపణలు రావడంతో ఆయన సోదరుడి ఇంట్లో తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. తిరుపతితోపాటు మదనపల్లెలో ఈ తనఖీలు కొనసాగుతున్నాయి.

**మహానంది, నవంబర్ 9 రిపబ్లిక్ న్యూస్:** కార్తీకమాసం శని,ఆది,సోమవారాల్లో అధిక సంఖ్యలో మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా కనులారా కామేశ్వరీ మహానందీశ్వరుల్ని దర్శించుకుని వెళ్ళడానికి వీలుగా భక్తులకు ఎటువంటి లోటూ రాకూడదని ఆలయమంతా తిరుగుతూ సిబ్బందికి తగు సూచనలు,ఆదేశాలు ఇస్తున్న ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి గారు



# మూసీ కాలుష్యానికి కారణం కాంగ్రెస్ చేసిన పాపమే: హరీశ్ రావు

సమస్యలు గాలికి వదిలి మంత్రులు, సీఎం గాల్లో తిరుగుతున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రావు విమర్శించారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్న ఘనపూర్లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు.



**హైదరాబాద్, నవంబర్, 09 (రిపబ్లిక్ న్యూస్):** సమస్యలు గాలికి వదిలి మంత్రులు, సీఎం గాల్లో తిరుగుతున్నారని మాజీ మంత్రి భారాస ఎమ్మెల్యే హరీశ్రావు విమర్శించారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్న ఘనపూర్లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మూసీ కాలుష్యానికి కారణం కాంగ్రెస్ చేసిన పాపమే అన్నారు. మూసీ నదిపై పాదయాత్ర కాదు.. పాపయాత్ర చేసస్తున్నారని చెప్పారు. మూసీ నది సమస్యలపై పాదయాత్రకు తాను సిద్ధమని పేర్కొన్నారు. ప్రజల సమస్యల గురించి ప్రశ్నిస్తున్న కేటీఆర్పై కేసులు పెట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా బలంతోనే కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కొంటామన్నారు. కేసీఆర్పై మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలు అప్రజాస్వామికమని చెప్పారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ అని మండిపడ్డారు. యాదాద్రిని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం నిధులు కేటాయించాలని హరీశ్రావు డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి సహా మంత్రులు పక్క రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్లడాన్ని హరీశ్రావు తప్పుబట్టారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. రాష్ట్రంలో సమస్యలు గాలికి వదిలి పక్క రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్తున్నారని ఆరోపించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత జిల్లాలోనే ధాన్యం కొనుగోళ్లు లేవని ఎద్దేవా చేశారు. మంత్రి సీతక్క సొంత జిల్లాలో పత్తికి మద్దతు ధర లేదన్నారు. ఆహార కల్తీ విషయంలో ముఖ్యమంత్రికి పట్టింపే లేదని విమర్శించారు. కాంగ్రెస్ చెప్పిన మార్పు ఇదేనా అని ప్రశ్నించారు. కలుషితాహారం కారణంగా గురుకులాల్లో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

కేపీహెచ్బీ ఏడో ఫేజ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి చెందాడు.




**కేపీహెచ్బీ కాలనీ, నవంబర్ 9 రిపబ్లిక్ న్యూస్:** కేపీహెచ్ బీ ఏడో ఫేజ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి చెందాడు. స్థానిక నర్సరీలో పనిచేస్తున్న కట్ట నరసింహ మూర్తి (70) ఉదయం కేపీహెచ్బీ ఏడో ఫేజ్ నుంచి నాలుగో ఫేజ్ వైపు రహదారి దాటుతుండగా ద్విచక్రవాహనదారుడు అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో ఆయన కాళ్లు, చేతులకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

# విద్యుదాఘాతంతో నగల దుకాణంలో అగ్ని ప్రమాదం

ఇల్లందు పట్టణం ఆంబజార్లోని పూజ జ్యువెల్లరీ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది.




**ఇల్లందు , నవంబర్ 9 రిపబ్లిక్ న్యూస్:** ఇల్లందు పట్టణం ఆంబజార్ లోని పూజ జ్యువెల్లరీ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికుల సమాచారంతో దుకాణం యజమాని, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సీసీ కెమెరాలు, ఒక టీవీతోపాటు కొంత ఫర్నిచర్ దగ్ధమైంది. సుమారు రూ.1.5 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేశారు. విద్యుదాఘాతం కారణంగానే ప్రమాదం జరిగినట్లు బాధితులు తెలిపారు.

# విశాఖ కేజీహెచ్ కొండపై గంజాయి సాగు కలకలం.. అదుపులో యువకులు


ఆంధ్రప్రదేశ్లో గంజాయి స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. ఏకంగా విశాఖ నడిబొడ్డున గంజాయి సాగు చేయడం కలకలం రేపుతోంది.



**విశాఖ, నవంబర్ 9 రిపబ్లిక్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ లో గంజాయి స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. ఏకంగా విశాఖ నడిబొడ్డున గంజాయి సాగు చేయడం కలకలం రేపుతోంది. కేజీహెచ్ కొండపై బాలికల వసతిగృహం వెనుక ఉన్న కొండపై పలువురు స్మగ్లర్లు గంజాయి పండిస్తున్నారు. ఏడాదిన్నరకాలంగా స్మగ్లర్లు కొండపై గంజాయి పండిస్తున్నారు. నేవీ పరిధిలో ఉన్న ప్రాంతంలో గంజాయి సాగు చేయడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి సంబంధించి పలువురు యువకులను విశాఖ వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భారీ స్థాయిలో గంజాయిని సాగు చేస్తున్నారని, దీనికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దీని వెనక ఎవరున్నారనే దానిపై విచారణ చేస్తున్నట్లు చెప్పారు. ఒక ముఠాగా ఏర్పడి గంజాయి సాగు చేస్తున్నారా.. లేదా ఆకతాయితనంగా చేస్తున్నారా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత


దువ్వూరి రామిరెడ్డి


హరగోవింద్ ఖొరానా


కాళీపట్నం రామారావు


అన్నపూర్ణాదేవి


కార్ల్ సాగన్


గరిమెళ్ళ బాలకృష్ణ



కేశవ కర్వే


ఉత్తరాఖండ్


కె.ఆర్.నారాయణన్

- **1895:** తెలుగు కవి దువ్వూరి రామిరెడ్డి జననం (మ.1947).
- **2011:** నోబెల్ బహుమతి పొందిన జీవ శాస్త్రజ్ఞుడు హరగోవింద్ ఖొరానా మరణం (జ.1922).
- **1924:** కారా మాస్టారుగా పసిద్ధి పొందిన సరళ భాషా రచయిత, కథకుడు, విమర్శకుడు కాళీపట్నం రామారావు జననం (చిత్రంలో).
- **1927:** స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వనిత, సమాజ సేవిక, రచయిత్రి మాగంటి అన్నపూర్ణాదేవి మరణం (జ.1900).
- **1934:** అమెరికన్ ఖగోళ శాస్త్రజ్ఞుడు, ఖగోళ భౌతిక శాస్త్రజ్ఞుడు, రచయిత కార్ల్ సాగన్ జననం (మ.1996).
- **1936:** రంగస్థల కళాకారిణి రేకందార్ అనసూయాదేవి జననం.
- **1948:** సంగీత విద్వాంసుడు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ జననం.
- **1962:** సంఘసంస్కర్త ధోండొ కేశవ కర్వే మరణం (జ.1858) (104 సంవత్సరాలు).
- **2000:** ఉత్తరాఖండ్ రాష్ట్రం ఏర్పడింది.
- **2005:** భారత మాజీ రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ మరణం (జ.1920).

రిపబ్లిక్ స్పోర్ట్స్

# ఎక్స్ట్రా బౌన్స్తో భారత బ్యాటర్లకు పరీక్షే.. అదొక్కటే నా సూచన: ఇయాన్ ఛాపెల్

ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్కు చేరుకోవాలంటే ఆసీస్ను 4-0తో ఓడించాల్సిన పరిస్థితి. కానీ, పొమ్ము చూస్తే మాత్రం భారత్కు కఠిన సవాల్ తప్పదని అనిపిస్తోంది.




స్వదేశంలో న్యూజిలాండ్తో మూడు టెస్టుల సిరీసు కోల్పోయిన భారత్ మరో కీలక పోరుకు సన్నద్ధమవుతోంది. బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ బరిలోకి దిగనుంది. హ్యాట్రిక్ కొట్టే అవకాశం టీమ్ ఇండియా ముంగిట ఉన్నప్పటికీ.. ప్రస్తుతం జట్టు పరిస్థితిని చూస్తే మాత్రం కష్టమేనన్న అభిప్రాయం క్రికెట్ విశ్లేషకుల్లో ఉంది. మరోవైపు ఆసీస్ మాత్రం స్వదేశంలో తమకు ఎదురులేదని నిరూపించుకోవాలన్న పట్టుదలతో ఉంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వంటి స్టార్లు ఉన్నప్పటికీ.. వారిద్దరూ ఫామ్లో లేకపోవడంతో భారత్కు కష్టాలు తప్పవని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ ఛాపెల్ వ్యాఖ్యానించాడు. అదనపు బౌన్స్ వచ్చే పిచ్లు ఇక్కడ ఉంటాయని.. షాట్లు కొట్టేందుకు ప్రయత్నిస్తే ఔటయ్యే ప్రమాదం ఉందని సూచించాడు. "గత సిరీస్ను గమనిస్తే భారత బ్యాటింగ్ ఆర్డర్లో సమస్యలు ఉన్నట్లు అనిపించింది. యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్, శుభ్మన్ గిల్, పంత్ మినహా మిగతా వారు పెద్దగా రాణించలేదు. రోహిత్, విరాట్ పూర్తిగా నిరాశపరిచారు. వారి వయసు గురించి కూడా అభిమానులు మాట్లాడుకొనే పరిస్థితి వస్తుందనుకుంటున్నా. భారత్తో టెస్టు సిరీస్ కోసం ఇప్పటికే మంచి పిచ్లు సిద్ధం చేశారు. అదనంగా బౌన్స్ వస్తుంది. ఒకవేళ బంతి పైనే ఉన్నప్పుడు షాట్లు కొడదామని భావిస్తే ఔటయ్యే ప్రమాదం లేకపోలేదు. అందుకోసం అత్యంత జాగ్రత్తగా ఆడాల్సిన అవసరం ఉంది. ఇది రెండు జట్లకూ వర్తించే అంశమే" అని ఇయాన్ చాపెల్ తెలిపాడు."భారత కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి గొప్ప ఫామ్లో లేరు. మరోవైపు పుజారా, రహానె వంటి కీలక ప్లేయర్లు జట్టులో లేరు. ఈసారి భారత జట్టు ఎక్కువగా కుర్రాళ్ల పైనే ఆధారపడాల్సి ఉంటుంది. టాప్ ఆర్డర్లో రోహిత్-విరాట్ విఫలమైతే.. లోయర్ ఆర్డర్, యువ బ్యాటర్లపై ఎక్కువ ఒత్తిడి పడనుంది. అందుకే, అత్యుత్తమ బ్యాటర్ల నుంచి కొన్ని పరుగులైనా వస్తే.. పరిస్థితి వేరేగా ఉండే అవకాశం ఉంది. కానీ, గత ఏడాదిన్నర నుంచి టెస్టుల్లో ఆ ఇద్దరి నుంచి ఒకటీ, అరా తప్ప భారీ ఇన్నింగ్స్ మీ వచ్చిన దాఖలాలు లేవు" అని ఆసీస్ మాజీ ఆటగాడు మార్క్ టేలర్ వ్యాఖ్యానించాడు.

# ప్రభాస్ లుక్ లీక్.. స్పందించిన 'కన్నప్ప' టీమ్

'కన్నప్ప' నుంచి ప్రభాస్ లుక్ లీక్ కావడంపై చిత్రబృందం స్పందించింది. ఆ ఫొటోను ఎవరూ షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేసింది.



మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తోన్న ఫాంటసీ డ్రామా 'కన్నప్ప'. ముకేశ్ కుమార్సింగ్ దర్శకత్వంలో ఇది తెరకెక్కుతోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా రానున్న ఈ చిత్రం నుంచి ప్రభాస్ లుక్ లీకైన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై చిత్రబృందం ప్రేక్షకులకు ఓ విజ్ఞప్తి చేసింది. ఆ ఫొటోను లీక్ చేసిన వారిని కనిపెడితే రూ.5 లక్షల బహుమానం ఇస్తామని వెల్లడించింది. "కన్నప్ప'కోసం గత ఎనిమిది సంవత్సరాలుగా మేము మా ప్రాణాలు పణంగా పెట్టి పనిచేస్తున్నాం. రెండు సంవత్సరాల నుంచి ఈ ప్రాజెక్ట్ పనులు జరుగుతున్నాయి. దీనికోసం మా టీమ్ నిరంతరం కృషి చేస్తోంది. ఇలాంటి సమయంలో 'కన్నప్ప' నుంచి ఒక్క ఫొటో అనధికారికంగా లీక్ అయినందుకు బాధపడుతున్నాం. ఈ లీక్ మా కష్టాన్ని మాత్రమే కాదు.. ఈ ప్రాజెక్ట్ కోసం నిరంతరం కృషి చేస్తున్న రెండు వేల మంది వీఎఫ్ఎక్స్ కళాకారుల జీవితాలను కూడా ప్రభావితం చేస్తోంది. ఈ ఫొటో బయటకు ఎలా వెళ్లిందనే విషయంపై మేము పోలీస్ కేసు పెట్టాము. దయచేసి ఈ ఫొటోను ఎవరూ షేర్ చేయొద్దని మనవి. దీన్ని షేర్ చేసిన వారు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అలాగే ఈ ఫొటోను లీక్ చేసిన వ్యక్తిని కనిపెట్టినవారికి రూ.5 లక్షలు బహుమానం అందిస్తాం. మీరందరూ మాకు సహకరిస్తారని ఆశిస్తున్నాం. మీ మద్దతుకు ధన్యవాదాలు' అని ఓ నోట్ను విడుదల చేసింది. 'కన్నప్ప' విషయానికొస్తే.. మంచు విష్ణు టైటిల్ పాత్రలో ముఖేశ్కుమార్ సింగ్ దర్శకత్వంలో రానున్న పాన్ ఇండియా చిత్రమిది. మోహన్బాబు నిర్మిస్తున్నారు. ప్రీతి ముకుందన్ కథానాయిక. ప్రభాస్, అక్షయ్ కుమార్, శరత్కుమార్, మోహన్లాల్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. దీని షూటింగ్ దాదాపుగా పూర్తయింది. ఇందులో శివుడి పాత్రలో అక్షయ్ కుమార్.. నంది పాత్రలో ప్రభాస్ కనిపించనున్నట్లు సమాచారం.

రిపబ్లిక్ సినిమా CINEMA

# 'యానిమల్ పార్క్'పై నిర్మాత అప్డేట్.. రిలీజ్ ఎప్పుడంటే!

యానిమల్ సీక్వెల్ 'యానిమల్ పార్క్' గురించి నిర్మాత భూషణ్ కుమార్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని రిలీజ్ గురించి అప్డేట్ ఇచ్చారు.



రణ్ బీర్ కపూర్ హీరోగా సందీప్ వంగా తెరకెక్కించిన చిత్రం 'యానిమల్స్. గతేడాది విడుదలైన ఈ సినిమా భారీ విజయాన్ని సాధించి.. మంచి వసూళ్లను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్గా 'యానిమల్ పార్క్' రానున్న సంగతి తెలిసిందే. మొదటిభాగం క్లైమాక్స్ లో సీక్వెల్ ఉందంటూ వెల్లడించారు దర్శకుడు. అప్పటినుంచి దీనిపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా దీని గురించి నిర్మాత భూషణ్ కుమార్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.'సందీప్ వంగా ప్రస్తుతం 'స్పిరిట్తో బిజీగా ఉన్నారు. అది పూర్తయిన తర్వాత 'యానిమల్ పార్క్' పనులు ప్రారంభిస్తారు . ఆరు నెలల్లో దీని పనులు మొదలుపెట్టే అవకాశం కనిపిస్తుంది. 'స్పిరిట్ పూర్తయిన వెంటనే 'యానిమల్ పార్క్' ఉంటుంది. 2027లో దీని విడుదల చేస్తాం' అని తెలిపారు. మొదటిభాగం కంటే ఇందులో మరిన్ని బలమైన పాత్రలు ఉంటాయని గతంలోనే సందీప్ వంగా తెలిపారు. అలాగే గతంలో వచ్చిన సినిమాల కంటే ఎక్కువ థ్రిల్ను పంచడమే 'యానిమల్ పార్క్' లక్ష్యమన్నారు. ఊహించనన్ని యాక్షన్ సన్నివేశాలుంటాయని తెలిపారు. రణ్ బీర్ కపూర్ పాత్ర మరింత క్రూరంగా ఉంటుందన్నారు.ప్రస్తుతం రణ్ బీర్ కూడా 'రామాయణ' షూటింగ్లో లో బిజీగా ఉన్నారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో రణ్బీర్ కపూర్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న చిత్రమిది. ఈ చిత్రం తర్వాత 'యానిమల్ పార్క్' తెరకెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే సందీప్ వంగా 'స్పిరిట్ పనుల్లో ఉన్నారు. పోలీస్ డ్రామాగా ఇది రానుంది. ఇటీవలే దీని మ్యూజిక్ సిటింగ్స్ ప్రారంభమయ్యాయి

# ఆరోగ్యం

## ఈ ఆహారాలను కలిపి ఎట్టి పరిస్థితుల్లో కూడా తినకూడదు.. ఎంత దూరంగా ఉంటే అంత మంచిది..





ఈ రోజుల్లో చాలా మంది అధిక బరువు సమస్యతో బాధపడుతున్నారు. . ఒక వ్యక్తి ఆహారపు అలవాట్లు అతని ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయి. ఆహారపు అలవాట్ల కారణంగా అధిక బరువు, బెల్లీ ఫ్యాట్ సమస్యలతో బాధపడుతున్నారు. బెల్లీ ఫ్యాట్ అంటే బొడ్డు చుట్టూ కొవ్వు పేరుకుపోవడం. దీంతో ఈ పొట్ట గుండ్రటి ఆకారంలో కనిపిస్తుంది. ఈ సమస్య ఉంటే నలుగురిలో తిరగాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది.కుర్చీల్లో కూర్చొని గంటలు గంటలు తరబడి పనులు చేయడం వల్ల ఇట్టే బరువు పెరిగిపోతున్నారు.అధిక బరువు వల్ల అనేక అనారోగ్యాలు వచ్చే ప్రమాదముంది. జీర్ణ సమస్యలు, గ్యాస్, పొట్ట ఉబ్బరం, గుండె సంబంధిత వ్యాధులు, లివర్ సమస్యలు వచ్చే ముప్పు ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధిక బరువు సమస్య ఉన్న వారు వెయిట్ లాస్ అవ్వడానికి నానా తంటాలు పడుతున్నారు. వ్యాయామాలు, డైట్ ఫాలో అవుతున్నారు. అయితే, బరువు తగ్గాలనుకునే వారు కొన్ని ఫుడ్స్ కలిపి తీసుకోకూడదంటున్నారు నిపుణులు. కొన్ని ఫుడ్ కాంబినేషన్స్ బరువును తగ్గించకుంటే మరింత పెంచుతాయి అని హెచ్చరిస్తున్నారు. ఇంతకీ ఆ ఫుడ్ కాంబినేషన్స్ ఏంటంటే..

### అన్నం, బంగాళదుంపలు..




బరువు తగ్గాలనుకునేవారు అన్నం, బంగాళదుంపలు కలిపి తినకూడదంటున్నారు నిపుణులు. బంగాళదుంపలో పిండి పదార్థం ఎక్కువగా ఉంటుంది. అన్నం తినడం వల్ల క్యాలరీలు ఎక్కువగా పెరుగుతాయి. దీంతో ఈ రెండింటి కాంబినేషన్ వెయిట్ లాస్ అవ్వాలనుకునేవారికి మంచి ఆప్షన్ కాదంటున్నారు. ఈ రెండింటిని కలిపి తింటే బరువు మరింత పెరిగే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ రెండింటీని వేరు వేరుగా తినవచ్చని చెబుతున్నారు. అయితే, తక్కువ మోతాదులో తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### స్నాక్స్, కూల్ డ్రింక్స్..




మనలో చాలా మంది ఏదైనా స్నాక్స్ తింటున్నప్పుడు టీ లేదా కాఫీ తీసుకుంటాం. కొందరు టీ, కాఫీ బదులు కూల్ డ్రింక్స్ తాగుతారు. అయితే, ఈ ఫుడ్ కాంబినేషన్ అంత మంచిది కాదంటున్నారు నిపుణులు. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునేవారు వీటికి దూరంగా ఉంటేనే మంచిది. ఎందుకంటే వీటిలో చక్కెర అధికంగా ఉంటుంది. దీంతో.. వీటిని తీసుకున్నప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలు బాగా పెరిగిపోతాయి. దీంతో అదనపు శక్తి ఉత్పత్తి అవుతుంది. దీంతో.. కొవ్వు బర్న్ కాదు. దీంతో.. బరువు పెరిగే ప్రమాదముంది. అందుకే ఈ ఫుడ్ కాంబినేషన్కి దూరంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు.

### డ్రై ఫ్రూట్స్, ఓట్స్..



చాలా మంది బరువు తగ్గడం కోసం డ్రై ఫ్రూట్స్, ఓట్స్ తీసుకుంటారు. వీటిని వేరు వేరుగా తీసుకుంటే ఎటువంటి ముప్పు లేదు. ఎందుకంటే ఓట్స్లో తక్కువ చక్కెర స్థాయిలు ఉంటాయి. డ్రై ఫ్రూట్స్లో మంచి ప్రోటీన్లు ఉంటాయి. అయితే, వీటిని కలిపి తింటే మాత్రం ఖచ్చితంగా బరువు పెరిగే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

### స్వీట్స్, చాక్లెట్స్..



చాలా మంది స్వీట్స్తో పాటు చాక్లెట్స్ కూడా కలిపి తింటారు. అయితే, ఇది ఎంత మాత్రం మంచిది కాదంటున్నారు నిపుణులు. ఇలా చేయడం రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయని హెచ్చరిస్తున్నారు. ఈ రెండింటిని తినడం వల్ల అదనపు శక్తి ఉత్పత్తి అవుతుంది. దీంతో.. కొవ్వు బర్న్ కాదు. దీంతో.. బరువు పెరిగే ప్రమాదముంది.

### వీటిని కూడా తినకండి..



పై చెప్పిన ఫుడ్ కాంబినేషన్స్తో పాటు కొన్ని ఆహారాలకు కూడా దూరంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. జంక్ ఫుడ్స్, వేయించిన ఆహారాలు, మసాలా ఫుడ్స్, కూల్ డ్రింక్స్, షుగరీ డ్రింక్స్, సోడియం ఎక్కువగా ఉన్న ఆహారాలు, ట్రాన్ ఫ్యాట్ ఎక్కువగా ఉన్న ఆహారాల్ని తినకూడదంటున్నారు. వీటిని తినడం వల్ల బరువు మరింత పెరిగే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.